సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 25 । జూలై । 2025


విమ్స్‌లో రంగుల మాయాజాలం 8లో


ప్రైవేట్ రిసార్ట్ నిర్మాణంలో విద్యుత్‌శాఖ పలకలు..! 8లో


ఏయూకి దివీస్ రూ.3.21కోట్ల సాయం 8లో

వీరమల్లుకు సాష్టాంగం

నిబంధనలకు పాతరేసిన ఏయూ అధికారులు

- ప్రభుత్వ జీవోను కాదని సినిమా ఈవెంట్‌కు అనుమతి
- బయటకు పొక్కకూడదని వీసీ రహస్య సమావేశం
- కూటమి ప్రభుత్వంలో దిగజారుతున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రతిష్ట



విశాఖ సిటీ: 'హరి హర వీరమల్లు'కు ఆంధ్రా యూనివర్సిటీ ఉన్నతాధికారులు సాష్టాంగపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సినిమా ఫంక్షన్ కోసం నిబంధనలకు పాతరేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల మైదానాలు, ప్రాంగణాలు ప్రైవేటు సభలు, సమావేశాలకు కేటాయించకూడదన్న ప్రభుత్వ ఉత్తర్వులను బుట్టదాఖలు చేశారు. నెల కిందట బుక్ చేసుకున్న ఒక విద్యా సంస్థ వేడుకలను సైతం రద్దు చేసి మరీ ఉప ముఖ్యమంత్రి సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు అనుమతులిచ్చేశారు. ఇపుడు ఈ విషయం బయటకు పొక్కితే ఇబ్బందులు వస్తాయని వర్సిటీ ఉపకులపతి జి.పి.రాజశేఖర్ విభాగాధిపతులతో రహస్య సమావేశం నిర్వహించడం కొసమెరుపు. ఒకవైపు హాస్టళ్లలో పురుగుల అన్నం తినలేక, సౌకర్యాలు లేక విద్యార్థులు ఆందోళన బాట పడితే, వాటిని పరిష్కరించని ఏయూ పాలకులు.. రాజకీయ, సినీ పెద్దల సేవలో తరించడం వివాదాస్పదమవుతోంది.

ఏయూలో రాజకీయ క్రీనీడ

ఆంధ్ర విశ్వవిద్యాలయం కూటమి రాజకీయ క్రీనీడకు వేదికగా మారిపోయింది. కూటమి ప్రజా ప్రతినిధుల జన్మదిన వేడుకలకు, ఆ పార్టీల కార్యక్రమాలకు కేంద్రంగా మార్చేశారు. ఎప్పటికప్పుడు కూటమి నేతల కటౌట్లు, బ్యానర్లతో యూనివర్సిటీని కప్పేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏయూలో తీసుకున్న నిర్ణయాలపై బురద జల్లే ప్రయత్నం చేశారు. వాటిపై లోతైన విచారణ చేపట్టాలని నిర్ణయిస్తూ ప్రత్యేక కమిటీని సైతం ఏర్పాటు చేశారు. నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఒక్క తప్పును కూడా నిరూపించలేకపోయారు. దీంతో ఆ కమిటీ నివేదికను పక్కనపెట్టేశారు. తాజాగా కూటమి పెద్దల సూచనలతో అధికారులు వివాదాస్పద నిర్ణయాల దిశగా అడుగులు వేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అతిథి ఉపాధ్యాయుల విషయంలో గతంలో ఎన్నడూ లేని విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఏళ్ల తరబడి గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న వారిని రోడ్డున పడేయాలని చూస్తున్నారు. వారి స్థానంలో కొత్త వారిని నియమించేందుకు ఏయూ అధికారులపై కూటమి నేతలు ఒత్తిడి చేస్తున్నట్లు వర్సిటీలో చర్చ జరుగుతోంది.

ఏయూ వీసీ రహస్య సమావేశం?

ఏయూ హాస్టళ్లలో అధ్వాన పరిస్థితులపై విద్యార్థులు రెండు రోజుల పాటు ఆందోళన చేశారు. పురుగుల అన్నం పెడుతున్నారని, హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని నిరసన తెలిపారు. ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నారని, ఏయూ అధికారులు అనుసరిస్తున్న వైఖరికి వ్యతిరేకంగా వీసీ కార్యాలయాన్ని ముట్టడించారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోని ఏయూ అధికారులు.. సినిమా ఫంక్షన్ వ్యవహారంపై ప్రత్యేకంగా భేటీ అవడం చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా సినిమా వేడుకకు కేటాయించిన విషయం బయటకు వస్తే.. తలనొప్పులు తప్పవన్న ఆందోళన వారిలో మొదలైంది. దీనిపై ఏయూ వీసీ రాజశేఖర్ విభాగాధిపతులతో రహస్యంగా సమావేశం నిర్వహించినట్లు సమాచారం. సినిమా ఫంక్షన్‌కు కన్వెన్షన్ సెంటర్‌ను కేటాయించడంపై కోర్టుకు వెళితే ఇబ్బందులు తప్పవని ఆ సమావేశంలో ఆయన పేర్కొన్నట్లు తెలిసింది. ఈ నిబంధనల విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తగా ఉండాలని, సినిమా ఫంక్షన్ వ్యవహారంపై ఎవరూ బయట చర్చించవద్దని సూచించినట్లు ఏయూలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..

ప్రభుత్వ విద్యా సంస్థల ఆట స్థలాలు, ప్రాంగణాలను అకడమిక్ కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 29వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ప్రభుత్వ విద్యా సంస్థల ప్రాంగణాల్లో రాజకీయ, సినిమా, ఇతర సభలు, సమావేశాల నిర్వహణకు లీజుకిచ్చే అవకాశం లేదు. కానీ ఏయూ ఉన్నతాధికారులు మాత్రం ఈ ఉత్తర్వులను తుంగలో తొక్కారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహణకు నిబంధనలకు విరుద్ధంగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌ను కేటాయించారు.

ఆదిత్య కాలేజ్ వేడుకను రద్దు చేసి మరీ..

వాస్తవానికి ఆదిత్య కాలేజ్ 1,500 మంది ఉత్తరాంధ్ర విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో అచీవర్స్ డే నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకోసం నెల రోజుల కిందటే ఏయూ కన్వెన్షన్ సెంటర్‌ను బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ 'హరి హర వీరమల్లు' సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు అదే వేదికను అడగడంతో, ఏయూ అధికారులు వెంటనే ఆదిత్య కాలేజ్ బుకింగ్‌ను రద్దు చేసేశారు. కేవలం రెండు రోజుల ముందే వారికి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఆదిత్య కాలేజ్ తమ వేడుకలను రద్దు చేసుకోవాల్సి వచ్చినట్లు సమాచారం. ఒక కాలేజీ కార్యక్రమాన్ని రద్దు చేసి మరీ సినిమా వేడుకకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌ను కేటాయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఫిరాయింపు కార్పొరేటర్లపై చర్యలు తీసుకోండి

జీవీఎంసీ కమిషనర్‌ను కోరిన వైఎస్సార్ సీపీ


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, నేతలు

డాబాగార్డెన్స్: పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లపై చర్యలు తీసుకున్న తర్వాతే జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నిక నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తైనాల విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం వారు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. స్థాయీ సంఘం ఎన్నిక నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఎన్నిక నిర్వహించాలంటే.. మున్సిపల్ కార్పొరేషన్ చట్టం ప్రకారం అర్హత గల వార్డు సభ్యులు నామినేషన్ అందజేయాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఏప్రిల్‌లో నిర్వహించిన మేయర్ అవిశ్వాస తీర్మానం(ఎన్నిక)లో వైఎస్సార్ సీపీ జెండాపై గెలిచిన 27 మంది కార్పొరేటర్లు.. పార్టీ విప్‌ను ధిక్కరించి ఓటు వేశారని గుర్తు చేశారు. ఈ కారణంగా వారిని వార్డు సభ్యులుగా అనర్హులుగా ప్రకటించాలని ప్రిసైడింగ్ అధికారి, కలెక్టర్‌ను పార్టీ విప్ కోరారని తెలిపారు. అప్పటి ప్రిసైడింగ్ అధికారి, పార్టీ విప్ అందజేసిన దరఖాస్తు సహేతుకమైనదని భావించి.. పార్టీ విప్‌ను ధిక్కరించిన కార్పొరేటర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు ఈ నెల 14న నోటీసులు పంపినట్లు పేర్కొన్నారు. సంబంధిత కార్పొరేటర్లు ఇచ్చిన వివరణపై తుది నిర్ణయం తీసుకోవాలని ప్రిసైడింగ్ అధికారికి హైకోర్టు ఆదేశించిందని, పార్టీ విప్‌ను ధిక్కరించిన వారందరూ కార్పొరేటర్లుగా చట్టప్రకారం అనర్హులని వారు పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు సంబంధిత అభ్యర్థులకు ఇచ్చిన నోటీసుపై తుది నిర్ణయం తీసుకునే వరకు, జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నిక నోటిఫికేషన్‌ను నిలుపుదల చేయాలని కమిషనర్‌ను కోరారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి శ్రావణమాస పూజలు


స్వర్ణాభరణ అలంకరణలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం నుంచి వచ్చే నెల 23 వరకు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రావణలక్ష్మి ప్రత్యేక కుంకుమ పూజలు జరపనున్నారు. ఈ ప్రత్యేక పూజలో సంకల్పం, లక్ష్మీ సహస్ర నామాలు, లక్ష్మీ హోమం, అమ్మవారి దర్శనం, వేద ఆశీర్వచనం చేపట్టనున్నారు. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు (దంపతులు) రూ.400 టికెట్ రుసుం చెల్లించాలి. పూజ అనంతరం భక్తులకు శేషవస్త్రంగా కండువా, జాకెట్టు ముక్క, పావుకేజీ పులిహోర, పావుకేజీ చక్కెర పొంగలి, శ్రీచక్రయంత్రం (రాగి)ని మహాప్రసాదంగా అందజేస్తారు. శ్రావణమాసంలో వచ్చే మూడో శుక్రవారం (ఆగస్టు 8) వరలక్ష్మీవ్రతం, 9న శ్రావణ పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే శ్రావణమాసంలో వచ్చే ఐదు శుక్రవారాలు (ఈ నెల 25, ఆగస్టు 1, 8, 15, 22) ప్రత్యేక పూజలు జరపనున్నారు.


నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించండి

ప్రొబేషనరీ ఎస్‌ఐలతో సీపీ


ప్రొబేషనరీ ఎస్‌ఐలతో సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ : క్షేత్ర స్థాయిలో విధి నిర్వహణ, పోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తుపై అవగాహన పెంచుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రొబేషనరీ ఎస్‌ఐలకు దిశా నిర్దేశం చేశారు. నగరానికి కేటాయించిన 34 ప్రొబేషనరీ ఎస్‌ఐలు గురువారం సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారితో సీపీ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి, నిజాయితీ, క్రమశిక్షణ, సేవాతత్పరతతో పనిచేయాలని సూచించారు. కష్టపడి పనిచేస్తూ పోలీస్ శాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో వినయంగా ప్రవర్తిస్తూ వారికి న్యాయం చేయాలని చెప్పారు. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. దర్యాప్తులో సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో డీసీపీ–1 అజితా వేజెండ్ల, డీసీపీ–2 డి.మేరి ప్రశాంతి, డీసీపీ(అడ్మిన్) కృష్ణకాంత్ పటేల్, డీసీపీ(క్రైమ్స్) కె.లతా మాధురి ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ బ్యాండ్‌కు కొత్త పరికరాలు


బ్యాండ్ వాయిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: జాతీయ, అంతర్జాతీయ ఈవెంట్స్‌కు అనుగుణంగా పోలీస్ బ్యాండ్ సామర్థ్యాన్ని, నాణ్యతను పెంచడానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అదనపు పరికరాలను సమకూర్చారు. గురువారం ఈ కొత్త పరికరాలను ప్రారంభించారు. బ్యాండ్ వాయించి సిబ్బందిలో హుషారు నింపారు. సెరిమోనియల్ పరేడ్‌లకు, రాష్ట్ర స్థాయి కార్యక్రమాలకు, స్వాతంత్ర్య, గణతంత్ర, పోలీస్ అమరవీరుల దినోత్సవాలకు ఈ కొత్త పరికరాలు ఉపయోగపడతాయని పోలీస్ బ్యాండ్ సిబ్బంది సీపీకి ధన్యవాదాలు తెలిపారు.

న్యాయవాదుల ధర్నా నేడు

విశాఖ లీగల్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఉదయం న్యాయవాదులు మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం విడుదల చేశారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు, న్యాయవాదుల చట్టం సవరణ వంటి అంశాలలో కూడిన 11 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ విశాఖ నగరం, విశాఖ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని న్యాయవాదులు ఈ మహాధర్నాలో పాల్గొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. న్యాయవాదులందరూ శుక్రవారం ఉదయం 11.30 గంటలకు కోర్టు బయట జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

మోసం చంద్రబాబు జన్మహక్కు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, పెందుర్తి సమన్వయకర్త అదీప్‌రాజ్, శరగడం, జయరామ్

- ఎన్నికల్లో తప్పుడు హామీలు ఇచ్చి వంచన చేయడం బాబుకు అలవాటే
- కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత కేడర్‌దే
- పెందుర్తిలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' సభలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి

పెందుర్తి: ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబు తన జన్మహక్కులా భావిస్తారని మాజీ ఎమ్మెల్యే, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ పరిశీలకురాలు శోభా హైమావతి విమర్శించారు. ఎన్నికల సమయంలో తప్పుడు హామీలు ఇవ్వడం, గెలిచాక ప్రజలను వంచన చేయడంలో చంద్రబాబును మించిన ఘనుడు వేరెవరూ లేరని ఎద్దేవా చేశారు. సుజాతనగర్‌లో పెందుర్తి గ్రామీణ, పట్టణ స్థాయి 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండో ఏడాది నడుస్తున్నా ఒకటి రెండు పథకాలు కూడా ప్రజలకు పూర్తి స్థాయిలో అందలేదన్నారు. రాష్ట్రంలో పేదలకు తగిన సహకారం అందాలన్న సంకల్పంతో గతంలో సీఎంగా వైఎస్ జగన్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని గుర్తు చేశారు. ఏడాది తిరగకముందే చంద్రబాబు తత్వం ప్రజలకు బోధపడిందన్నారు. ఆడబిడ్డ నిధి ఎగ్గొట్టాలన్న దురుద్దేశంతోనే మంత్రి అచ్చెన్నాయుడు ఆ పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలన్న వాఖ్యలు చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనను క్షేత్రస్థాయిలో ఎండగట్టేందుకు వైఎస్సార్‌సీపీ కేడర్ నడుం బిగించాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే, పెందుర్తి సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ నమ్మకం పేరు చెబితే వైఎస్ జగన్ గుర్తుకు వస్తారని.. మోసం పేరు చెబితే చంద్రబాబు గుర్తుకు వస్తారని విమర్శించారు. కేవలం అధికారం కోసమే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో సూపర్‌సిక్స్‌తో పాటు 143 హామీలతో మేనిఫెస్టో విడుదల చేశారని.. అధికారంలోకి వచ్చిన మరుక్షణమే దాన్ని బుట్టదాఖలు చేశారని మండిపడ్డారు. నియోజకవర్గంలో కూటమి నాయకులకు అవినీతి, అక్రమాలు, కబ్జాలు చేయడం తప్ప ప్రజా సంక్షేమం పట్టడంలేదన్నారు. త్వరలో పార్టీలో పూర్తిస్థాయి కమిటీలు వేస్తామని ప్రకటించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నేతలు బయిలపూడి భగవాన్ జయరామ్, శరగడం చినఅప్పలనాయుడు, ఉప్పిలి కనకరాజు, గండ్రెడ్డి మహాలక్ష్మి నాయుడు, ఉగ్గిన గోవింద్, యతిరాజుల నాగేశ్వరరావు, గొరపల్లి శ్రీను, గొర్లె రామునాయుడు, చొప్పా నాగరాజు, గొరపల్లి సాంబ, మెంటి మహేష్, దాసరి సత్తిబాబు, బండి సత్తిబాబు, రాపర్తి మాధవరావు, కోరాడ చందుయాదవ్, కొయిలాడ శ్రీను, బొడ్డు సూర్యప్రకాష్, కిల్లి అప్పారావు, పాలిశెట్టి సురేష్‌రాజ్, బల్ల రాంబాబు, సూరిశెట్టి సూరిబాబు, దాడి అర్జున్, అవగడ్డ శ్రీనివాస్, కాళ్ల గంగాధర్, ఎస్‌జేడీ శ్రీను, మీసాల విజయ, విజయలక్ష్మి, నక్కా మహేష్, కోన శ్రీను, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: తాడి–దువ్వాడ డౌన్ లైన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఆగస్టు 26, 28, 30వ తేదీల్లో రాజమండ్రి–విశాఖపట్నం–రాజమండ్రి (67285/67286) మెము పాసింజర్, ఆగస్టు 26, 28, 30వ తేదీల్లో కాకినాడ–విశాఖపట్నం–కాకినాడ (17267/17268) ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26, 30వ తేదీల్లో గుంటూరు–విశాఖపట్నం–గుంటూరు(22876 / 22875) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 26, 28, 30వ తేదీల్లో విజయవాడ–విశాఖపట్నం–విజయవాడ (12718/12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఇరువైపులా రద్దు చేశారు.

స్మార్ట్ షాపింగ్.. పెరుగుదే అగ్రస్థానం





- ఆన్‌లైన్ ఆర్డర్లలో సరికొత్త ట్రెండ్
- ఇన్‌స్టంట్ డెలివరీలో వైజాగ్ వాసులే ట్రెండింగ్
- ఏడాది కాలంలో 337 ఆర్డర్లు చేసిన విశాఖ వాసి
- మధ్యాహ్నం, అర్ధరాత్రి సమయంలో అత్యధిక ఆర్డర్లు
- ఇన్‌స్టామార్ట్ సర్వేలో వెల్లడి



సాక్షి, విశాఖపట్నం: టీ పెట్టాలి.. పాలు లేవా? అయితే ఆర్డర్ పెట్టేద్దాం. ఐస్‌క్రీమ్ తినాలనిపిస్తోందా? ఆర్డర్ చేసేద్దాం. వర్షం పడుతోంది.. వేడివేడి స్నాక్స్ కావాలి? ఆర్డర్.! ఎక్కడ చూసినా ఇప్పుడు 'క్లిక్.. ఆర్డర్' ట్రెండ్ నడుస్తోంది. ఒకప్పుడు చిన్న షాంపూ కావాలన్నా వీధి చివర దుకాణానికి వెళ్లేవాళ్లం. పెరుగు కోసం డెయిరీకి, స్వీట్స్ కోసం మిఠాయి షాపుకి.. ఇలా ఏం కావాలంటే అక్కడికి వెళ్లి తెచ్చుకునేవాళ్లం. కానీ.. ఇప్పుడు ఫాస్ట్ డెలివరీ యాప్స్ వచ్చాక.. మనకు కావాల్సిన వస్తువు పది నిమిషాల్లోనే మన ఇంటికి వచ్చేస్తోంది. అందుకే ఆన్‌లైన్ ఆర్డర్లకు రోజురోజుకూ క్రేజ్ పెరుగుతోంది. వైజాగ్‌లో కూడా క్విక్ డెలివరీ యాప్స్‌కు ఆదరణ బాగా పెరిగిందని 'ఇన్‌స్టామార్ట్' సంస్థ చేసిన సర్వేలో వెల్లడైంది. ఇంతకీ వైజాగ్ వాసులు ఫాస్టెస్ట్ డెలివరీ యాప్స్‌లో ఎక్కువగా ఏం ఆర్డర్ చేస్తున్నారో తెలుసా? అదేనండి.. పెరుగు. ఇంకా ఏయే విషయాల్లో వైజాగ్ వాసులు 'ఫాస్ట్'గా ఉన్నారో తెలుసుకుందామా?

ఉరుకుల పరుగుల జీవనంలో ఇప్పుడు అంతా అరచేతిలోనే జరిగిపోతోంది. నచ్చింది తినాలన్నా, కొనాలన్నా ఒక్క క్లిక్‌తో ఇంటికే తెప్పించుకుంటున్నారు. ఆర్డర్ పెట్టి 10 నుంచి 15 రోజులు వేచి చూసే రోజులు పోయాయి. ఆర్డర్ పెట్టిన 15 నిమిషాల్లో డెలివరీ చేస్తాం అని ఒకరంటే, లేదు లేదు.. 10 నిమిషాల్లోనే మీ ఇంటికి తెస్తాం అని మరొకరు పోటీపడి మరీ కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు. పైగా, షాప్‌లలో కూడా లభించని ఆఫర్లతో నిమిషాల్లోనే వస్తువులు ఇంటికి వస్తుండటంతో.. శ్రమ తప్పుతోందని భావించి అంతా 'క్విక్ కామర్స్'పైనే ఆధారపడుతున్నారు.

మధ్యాహ్నం, రాత్రి వేళల్లోనే అధికం

ఉదయం పూటతో పోలిస్తే, మధ్యాహ్నం భోజన సమయంలో, అలాగే అర్ధరాత్రి వేళల్లో నగరంలో క్విక్ ఆర్డర్లు అత్యధికంగా ఉంటున్నాయి. హైపర్–ఎఫెక్టివ్ డెలివరీ నెట్‌వర్క్ మద్దతుతో ఆన్‌లైన్ గ్రోసరీ డెలివరీ సంస్థల మధ్య పోటీ తీవ్రమవుతోంది. వీలైనంత త్వరగా వినియోగదారుడికి చేరుకోవాలనే పోటీతో, తక్కువ సమయంలో అందించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్లాట్‌ఫాంలో సగటున 10.4 నిమిషాల్లోనే ఆర్డర్లు డెలివరీ అవుతున్నాయి. ఈ జూన్‌లో ఇన్‌స్టామార్ట్ ఒక ఆర్డర్‌ను కేవలం 2.18 నిమిషాల్లో అందజేసి రికార్డు సృష్టించింది. 2024 జూన్ నుంచి 2025 జూన్ మధ్య నగరానికి చెందిన ఒక వినియోగదారుడు ఏకంగా 337 ఆర్డర్లు చేశాడంటే.. ఈ యాప్స్ మనల్ని ఎంతలా ప్రభావితం చేస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. స్థానిక ఉత్పత్తుల నుంచి ప్రీమియం వస్తువుల వరకు విస్తృత శ్రేణిలో అందించేందుకు ఈ–కామర్స్ ప్లాట్‌ఫాంలు పోటీపడుతున్నాయి. అందుకే విశాఖ వాసి ఇల్లు కదలకుండా, తనకు నచ్చిన వస్తువును కొనుగోలు చేస్తూ 'స్మార్ట్'గా మార్ట్‌ను ఇంటికి తెప్పించుకుంటున్నాడు. వినియోగదారుడి ఆసక్తికి అనుగుణంగా ఆఫర్లతో ఆకట్టుకుంటూ, ఆన్‌లైన్ గ్రోసరీ డెలివరీ యాప్స్ తమ ఆర్డర్లను గణనీయంగా పెంచుకుంటున్నాయి.

ఏమేం ఆర్డర్ చేస్తున్నారంటే...

ఇన్‌స్టామార్ట్ క్విక్ కామర్స్ యాప్.. ఏడాది పాటు విశాఖ నగరంలో చేసిన సర్వేలో పలు ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి.

- వైజాగ్ ప్రజలు చేసే ప్రతి 10 ఆర్డర్లలో 7 పెరుగు కోసమే ఉంటున్నాయి. ఫుల్ క్రీమ్, టోన్డ్ మిల్క్, పన్నీర్ కూడా బాగా కొనుగోలు చేస్తున్నారు.
- తర్వాతి స్థానంలో ఐస్‌క్రీమ్‌లు, స్వీట్స్ ఉన్నాయి. వీటి ఆర్డర్లలో ఏడాది కాలంలో 112 శాతం వృద్ధి కనిపించింది.
- టమాటాలు, రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్, ఉల్లిపాయలు, గుడ్లు, బంగాళాదుంపలు వంటి కూరగాయలనూ ఆన్‌లైన్‌లోనే కొంటున్నారు. ఉదయం లంచ్ బాక్స్ కోసం ఏ కూర వండాలో నిర్ణయించుకుని ఆన్‌లైన్‌లో తాజా కూరగాయలకు ఆర్డర్ పెడుతున్నారు. తాలింపు సిద్ధం చేసుకునేలోపే.. కూరగాయలు ఇంటికి చేరుతున్నాయి.
- వీటితో పాటు వేరుశనగ, కొబ్బరి, లేత కొబ్బరి, ఇడ్లీ రవ్వ వంటి ఉత్పత్తులకు కూడా అధిక డిమాండ్ ఉంది.
- వివాహ సీజన్‌లో సౌందర్య, వస్త్రధారణ ఉత్పత్తుల ఆర్డర్లు పెరుగుతున్నాయి.
- వర్షాకాలంలో సాయంత్రం వేళల్లో బంగాళాదుంప చిప్స్, ఆలూ భుజియా, పాప్‌కార్న్ వంటి స్నాక్స్ ఎక్కువగా కొంటున్నారు.
- పండగల సమయంలో పండ్లు, కూరగాయలు, పూజా నిత్యావసరాలను ఆర్డర్ చేస్తున్నారు.

59 చోరీ కేసుల్లో 73 మంది అరెస్ట్

- రూ.1.06 కోట్లు చోరీ సొత్తు స్వాధీనం
- రికవరీ మేళాలో బాధితులకు అందజేసిన సీపీ

విశాఖ సిటీ : నగరంలో నేర నియంత్రణకు, నిందితుల పట్టివేతకు చేపడుతున్న చర్యలు సత్ఫలితాన్నిస్తున్నాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జూన్ లో నగరంలో 84 చోరీ కేసులు నమోదైనట్లు తెలిపారు. వీటిలో 59 కేసులను ఛేదించి, 73 మంది నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి నుంచి రూ.1,06,03,665 చోరీ సొత్తును రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఇందులో 1.2 కేజీల బంగారం, 427.8 గ్రాముల వెండి, రూ.5,67,300 నగదు, 3 బైక్‌లు, 6 ఆటోలు, 3 ల్యాప్‌టాప్‌లు, 2 యాపిల్ ఐప్యాడ్స్, రూ.93 వేలు విలువ చేసే కాపర్ వైర్ కేబుల్స్, 430 మొబైల్ ఫోన్లు ఉన్నట్లు వివరించారు. నేర నియంత్రణతో పాటు నేరస్తులను గుర్తించేందుకు నగరంలో విస్తృతంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జూన్ నెలలో 440 కెమెరాలు పెట్టామన్నారు. నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక పెట్రోలింగ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రామ మందిరం వివాదంలో ముగ్గురిపై కేసు

బీచ్ రోడ్డులో రామ మందిరం సెట్ వివాదంలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సీతారాముల కల్యాణానికి భద్రాచలం దేవస్థానం నుంచి పూజారులను తీసుకువస్తామని తప్పుడు ప్రకటనలు చేశారన్న విషయంపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. నిర్వాహకులు మాత్రం తాము దేవస్థానం నుంచి పూజారులను తెస్తున్నట్లు చెప్పలేదని, భద్రాచలం నుంచి పూజారులను మాత్రమే తీసుకొస్తామని చెప్పినట్లు వివరించారు. దీనిపై విచారణ చేయగా భద్రాచలం దేవస్థానం నుంచి తీసుకొస్తామనే ప్రకటించిన విషయం గుర్తించినట్లు వెల్లడించారు. దీంతో వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఇతరత్రా విషయాలపై కూడా దర్యాప్తు జరుగుతోందన్నారు. అనంతరం సీపీ చేతుల మీదుగా బాధితులకు రికవరీ చేసిన సొత్తును అందజేశారు. డీసీపీ(క్రైమ్) లతా మాధురి పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న సొత్తు


రికవరీ చేసిన సొత్తును బాధితురాలికి అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

'ఆది కర్మయోగి'తో గిరిజన ప్రాంతాల అభివృద్ధి

బీచ్‌రోడ్డు: కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంత అభివృద్ధికి చేపట్టిన ఆది కర్మయోగి కార్యక్రమంలో అధికారులు ఆదికర్మ యోగులుగా ముఖ్య లక్ష్యాన్ని చేరుకోవాలని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ కార్యదర్శి విభూ నాయర్ సూచించారు. గురువారం నగరంలోని ఓ హోటల్లో నాలుగు రోజుల కర్మయోగి రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ప్రధానంగా గిరిజన గ్రామాభివృద్ధి దిశగా ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఎస్.భార్గవి కార్యక్రమ లక్ష్యాలు, అధికారుల విధులు, బాధ్యతలు వివరించారు.

క్లుప్తంగా

శ్రావణ శుక్రవారాల్లో సింహగిరిపై కుంకుమార్చనలు

ఆగస్టు 22న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం రోజుల్లో లక్ష కుంకుమార్చన ఆర్జిత పూజను విశేషంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు గురువారం తెలిపారు. ఈ నెల 25, ఆగస్టు 1, 8, 15, 22 తేదీల్లో వచ్చే శ్రావణ శుక్రవారాల్లో ఆలయంలో కొలువైన సింహవల్లీ తాయారుకి ఉదయం 7 నుంచి 9 వరకు ఈ పూజ జరుగుతుందన్నారు. రూ.2,500 టికెట్‌తో దంపతులు పాల్గొనవచ్చురు. సాయంత్రం 5.30 నుంచి 6 వరకు సహస్ర నామార్చన జరుగుతుందని, పాల్గొనే భక్తులు రూ.500 టికెట్ తీసుకోవాలన్నారు. సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలో, ఆన్‌లైన్‌లో టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఆగస్టు 22 ఆఖరి శ్రావణ శుక్రవారం ఉదయం 8 నుంచి సింహగిరిపై ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. పాల్గొనే మహిళలకు దేవస్థానమే పూజాసామగ్రి అందిస్తుందన్నారు. ఆగస్టు 1న స్వాతి నక్షత్రం కావడంతో ఆ రోజు నృసింహ హోమం రద్దు చేసినట్లు వెల్లడించారు.

నేటి నుంచి జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు, రాష్ట్ర స్థాయి జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్టు విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్ మహంతి తెలిపారు. పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో ఆగస్టు 8 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న జూనియర్ పురుషులు మరియు స్త్రీల ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుందని చెప్పారు. మరిన్ని వివరాలకు వీడీబీఏ జిల్లా కార్యదర్శి జి.భూషణరావును 99667 53209లో సంప్రదించాలని సూచించారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

విశాఖ లీగల్: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఏడాదిన్నర శిక్ష, రూ.15 వేలు జరిమాన విధిస్తూ నగరంలోని జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పి.ప్రదీప గురువారం తీర్పు నిచ్చారు. జరిమాన చెల్లించకుంటే అదనంగా నెల రోజులు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు ఉరిటి రవీంద్ర(26) గోపాలపట్నం బాజీజంక్షన్ దగ్గర ఉంటున్నాడు. 2019 జనవరి 26వ తేదీన ఎన్ఏడీ జంక్షన్ ప్రాంతానికి చెందిన బాధితురాలు ఇంట్లో కూర్చుని కుటుంబ సభ్యులతో టీవీ చూస్తోంది. ఆ సమయంలో రవీంద్ర ఇంట్లోకి చొరబడి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆ క్రమంలో ఆమెకు స్వల్పగాయాలయ్యాయి. బాధితురాలు ఎయిర్‌పోర్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ మహేశ్వరరావు కేసు నమోదు చేసి నిందితునిపై భారతీయ శిక్షాస్మృతి 323,354 సెక్షన్ కింద నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు నిచ్చారు.

విమ్స్‌లో రంగుల మాయాజాలం

- పగిలిన గోడలు, పెచ్చులూడిన కిటికీల సన్‌షేడ్లు
- వాటికి మరమ్మతులు చేపట్టకుండానే రంగులు
- వెంటనే వదిలేసిన వైనం



రంగులు వేస్తున్న కూలీలు, రంగులు వేసిన పక్కనే నాచుపట్టి, విరిగిన సన్‌షేడ్‌తో గోడ భాగం, రంగులు వేసిన వారంలోనే వదిలేసి బయటకు కనిపిస్తున్న నాచుపట్టిన గోడ భాగం

ఆరిలోవ : విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) భవనాలకు ఎట్టకేలకు రంగులు వేస్తున్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎంఎస్ఐడీసీ) అధికారులు రంగులు వేయడంలో మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. గోడలకు మరమ్మతులు చేపట్టకుండా పైపైనే మెరుగులు దిద్దుతున్నారు. ఆ మెరుగులు మూణ్నాళ్ల ముచ్చటగా మిగులుతున్నాయి. విరిగిన గోడలు, పెచ్చులూడిన కిటికీల సన్ షేడ్లుకు మరమ్మతులు చేపట్టకుండా రంగులు వేసేస్తున్నారు. వేస్తున్న రంగులు గోడలకు సరిగా పట్టకుండా వెంటవెంటనే వదిలేస్తున్నాయి. లోపల మరుగుదొడ్లు ఉన్నచోట గోడలకు అమర్చిన పైపుల భాగాల్లో బాగా నాచుపట్టి చెమ్మతో ఉన్నాయి. ఆయా భాగాల్లో గోడలకు పెచ్చులు సైతం ఊడిపోయాయి. అయినప్పటికీ ఆయాచోట్ల పట్టిన నాచును తొలగించలేదు.. ఊడిపోయిన సిమెంట్ పెచ్చులను కూడా తొలగించలేదు. మరమ్మతులు చేపట్టకుండా, నాచుపైనే పెయింటింగ్ చేయించేస్తున్నారు. దీంతో వారం రోజులకే కొన్నిచోట్ల నాచుతోపాటు వేసిన రంగులు ఊడిపోయాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.5 కోట్లు మంజూరు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2023లో విమ్స్‌లో భవనాల మరమ్మతుల కోసం సుమారు రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. అప్పట్లో ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. ఆ పనులను అధికారులు ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆ కాంట్రాక్టర్ కొన్నాళ్లపాటు పనులు జరిపి మధ్యలో నిలిపేశాడు. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం విమ్స్ మరమ్మతుల విషయాన్ని మరిచిపోయింది. ఇటీవల దీని గోడలు మరింత శిథిలావస్థకు చేరడంతోపాటు నాచు పట్టిన గోడలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు స్పందించారు. గత ప్రభుత్వంలో విడుదల చేసిన నిధులతోనే మరమ్మతులు జరిపించడానికి సిద్ధమయ్యారు. అయితే అనుకున్నట్లుగా మరమ్మతులు జరపకుండా విమ్స్ బ్లాకులకు పెయింటింగ్ చేసుకుపోతున్నారు. ఒకే పొర పెయింటింగ్ వేస్తుండటంతో ఆ రంగు వారానికే వదిలేస్తోంది. పెయింటింగ్ వదిలేస్తుండటంతో గోడలకు ఉండే నాచు బయటకు కనిపిస్తోంది. రంగులు వేసిన కొత్తదనం కొన్నాళ్లెనా లేకుండా పోతోంది. గత ప్రభుత్వంలో మరమ్మతుల కోసం మంజూరైన నిధులతో రంగులు వేసి సరిపెటేట్ ప్రయత్నంలో అధికారులున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ గోడలకు వేస్తున్న రంగుల తీరును చూసిన రోగులు, వారి బంధువులు ముక్కున వేలేసుకుంటున్నారు.

ప్రైవేట్ రిసార్ట్ నిర్మాణంలో విద్యుత్ శాఖ పలకలు!

- అయోధ్యనగర్‌లో అధికార పార్టీ అండతో ఆగడాలు
- అనుమతుల్లేకుండానే భారీ రిసార్ట్ నిర్మాణం
- ప్లానింగ్ సెక్రటరీ అభ్యంతరం తెలిపినా ఆగని పనులు



అయోధ్యనగర్ గ్లోబ్ స్కూల్ ఎదురుగా కనీస అనుమతులు లేకుండా భారీ నిర్మాణం



చెట్టుకు రక్షణ కవచంగా వేసిన విద్యుత్ శాఖ పలకలు

మధురవాడ : ధనబలం, రాజకీయ దన్ను ఉంటే అనుమతి లేని నిర్మాణాలు చేపట్టడమే కాదు ప్రభుత్వ సామగ్రిని కూడా ఇష్టానుసారం వాడేసుకోవచ్చని కొత్త భాష్యం చెబుతున్నారు కొందరు. దానికి నిదర్శనం మధురవాడ జీవీఎంసీ 7వ వార్డు అయోధ్యనగర్ గ్లోబ్ స్కూల్ ఎదురుగా ఓ భారీ రిసార్ట్ పేరుతో చేపడుతున్న నిర్మాణమే. ఇక్కడ విద్యుత్ శాఖ అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ నిర్మాణం కోసం ప్రత్యేకంగా అచ్చువేసిన పలకలను నిర్మాణ పనుల కోసం సిద్ధం చేసి ఉంచారు. పైగా ఇక్కడ మోడుబారిపోయిన చెట్లకు రక్షణ కోసమే కాకుండా రెండు మూడు లోడులు ఉండే పలకల లాట్ నిర్మాణ పనులకు వాడడం కోసం ఉంచినట్టు సమాచారం. ఇక్కడ స్విమ్మింగ్ పూల్ నిర్మాణం కోసం కిందభాగంలో వాడటానికి సిద్ధం చేసి ఉంచారని తెలుస్తోంది. ఇవి ప్రస్తుతం జరుగుతున్న విద్యుత్ పనులకు సంబంధించినవా లేక.. గతంలో జరిగిన పనులకు చెందినవా, ఎలా వచ్చాయి అన్నది విచారణలో తేలాల్సి ఉంది. దీనిపై విద్యుత్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింహాచలం నాయుడును వివరణ కోరగా ఇవి కేవలం విద్యుత్ శాఖ పనుల కోసమే నిర్దేశించినవని తెలిపారు. ఇతర పనులకు, ప్రైవేటు వ్యక్తులు వాడటానికి వీల్లేదని, దీనిపై దర్యాప్తు చేస్తామని చెప్పారు.

ప్లానూ లేదు.. అనుమతులూ లేవు

ఇక్కడ సుమారు 2 ఎకరాల విస్తీర్ణంలో ఫంక్షన్ హాలు పేరుతో భారీ రిసార్ట్ నిర్మాణ పనులు కొద్ది రోజుల క్రితం ప్రారంభించారు. దీనికి ఎటువంటి ప్లాన్, అనుమతులు లేకపోగా.. జీవీఎంసీకి చెల్లించాల్సిన వీఎల్‌టీ వంటివి ఏమీ చెల్లించలేదని ఫిర్యాదు అందింది. దీంతో ప్లానింగ్ సెక్రటరీ సదరు నిర్మాణాన్ని పరిశీలించి ప్లాన్ లేదని, పనులు నిలుపుదల చేయాలని సూచించారు. అయినా నిర్మాణదారులు ఏమాత్రం పట్టించుకోలేదు. పనులు ఆపలేదు. ఈ నిర్మాణం అధికార పార్టీ నాయకులదంటూ ప్రచారం జరుగుతోంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి

దీనికి ప్లాన్, వీఎల్‌టీ, ప్రభుత్వానికి కట్టాల్సిన ఇతరు ఫీజులు కలిపితే లక్షల్లోనే ఉంటుందని తెలుస్తోంది. ఆ ఆదాయం అంతా జీవీఎంసీకి ఎగ్గొట్టినట్టేనని తెలుస్తోంది. ఈ విషయాలు అటు ఉంచితే ఇంత భారీ స్థాయిలో పనులు జరుగుతున్నా ప్లాన్ ఫ్లెక్సీ గాని, ఇతరులకు ఇబ్బంది కలగకుండా జీవీఎంసీ కమిషనర్ సూచించినట్లు నిర్మాణం చుట్టూ గ్రీన్ మ్యాట్ ఏర్పాటు గానీ ఏమీ లేవు. ప్లాన్ లేకుండా పనులు ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తే, గేదెలు కట్టుకోవడానికి షెడ్ నిర్మిస్తున్నామంటూ సెటైర్లు వేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

మా బిడ్డను చంపేశాడు

- ప్రేమించానంటూ వెంటపడి ఉసురు తీశాడు
- మృతురాలు కావ్యశ్రీ తల్లిదండ్రులు



యశ్వంత్‌తో కావ్యశ్రీ (ఫైల్)

దాబాగార్డెన్స్: వివాహం చేసుకుంటానని తమ కుమార్తెను వంచించి వేరే వ్యక్తితో సంబంధం ఉందంటూ యశ్వంత్ అనే యువకుడు చంపేశాడని ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి ప్రాంతానికి చెందిన కార్తీక రామారావు, కార్తీక రామలక్ష్మి కన్నీరు మున్నీరయ్యారు. కార్తీక నవ్యశ్రీ (25)ని ప్రేమికుడు యశ్వంత్ తామెవరం ఇంట్లో లేని సమయంలో ఈ నెల 2వ తేదీన చంపేశాడని తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతురాలు కార్తీక నవ్యశ్రీ తల్లిదండ్రులు రామారావు, రామలక్ష్మి తెలిపిన వివరాలివి. 35 ఏళ్ల కిందట బతుకు తెరువు కోసం శ్రీకాకుళం జిల్లా కొత్తూరు నుంచి ఇక్కడికి వచ్చి కూలి పనులు చేసుకుంటున్నామని వారు చెప్పారు. తమ కుమార్తె కార్తీక నవ్యశ్రీ, యశ్వంత్ మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారని తెలిపారు. వారి పెళ్లికి రెండు కుటుంబాలు సమ్మతించాయన్నారు. ఈ నేపథ్యంలో కావ్యశ్రీకి హైదరాబద్‌లో ఉద్యోగం దొరకడంతో వెళ్లి ఉద్యోగం చేసుకోమని యశ్వంత్ ఆమెతో చెప్పాడని పేర్కొన్నారు.

అక్కడి నుంచే వేధింపులు ప్రారంభం..

కావ్యశ్రీ హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటుండగా అనుమానం పెంచుకున్న యశ్వంత్ నీవు ఎవరితోనో తిరుగుతున్నావని తరచూ వేధించేవాడని, కావ్యశ్రీని వైజాగ్ వచ్చేయమని చెప్పడంతో ఆమె మూడు నెలల కిందట వచ్చి వర్క్ ఫ్రం హోం చేస్తుందని తెలిపారు.

మేము లేనప్పుడు..

గత నెల 29న ఇంటి పని కోసం కొత్తూరు వెళ్లామని, కావ్యశ్రీ నుంచి ఫోన్ వచ్చిందని, యశ్వంత్ తనను వేధిస్తున్నాడని చెప్పిందన్నారు. మూడు రోజుల పాటు యశ్వంత్ కావ్యశ్రీతోనే ఉన్నట్లు స్థానికుల ద్వారా తెలుసుకున్నట్టు చెప్పారు. ఈ నెల 1వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత (2వ తేదీ వేకువ జాము) యశ్వంత్ నుంచి తమకు ఫోన్ వచ్చిందని, కావ్యశ్రీ ఉరి పోసుకున్నట్టు తెలిపాడన్నారు. ఉదయం వచ్చి చూసే సరికి తమ కుమార్తె చనిపోయి ఉందన్నారు. ఆమె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, ఇంట్లో ఉన్న హుక్ కూడా ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకునేంతగా ఉండదని, యశ్వంతే తమ కుమార్తెను చంపేసి ఉండాడని అనుమానం వ్యక్తం చేశారు. స్థానికులు, కావ్యశ్రీ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి యశ్వంత్‌ను అరెస్టు చేశారు. ప్రస్తుతం అతను రిమాండ్‌లో ఉన్నాడు.

భీమ్‌నగర్ పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్



భీమ్‌నగర్ పీహెచ్‌సీలోని ఫార్మసీని పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

అల్లిపురం: భీమ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సిబ్బంది నమోదు చేస్తున్న రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఫార్మసీ సెక్షన్‌లో మందుల నిల్వలు గురించి ఆరా తీశారు. రోగులతో మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీకి వస్తున్న రోగులకు గల సౌకర్యాలను, డాక్టర్లు, సిబ్బంది హాజరును పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



మాట్లాడుతున్న పీవీఎన్ మాధవ్

అల్లిపురం: రాష్ట్రంలో వ్యాపారులు, పారిశ్రామికవేత్తల సమస్యలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, వైజాగ్‌పట్నం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో హోటల్ దసపల్లాలో గురువారం జరిగిన ఇంటరాక్టివ్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభిన్న రంగాల నుండి వచ్చిన వ్యాపార, పారిశ్రామిక నాయకులు పీవీఎన్ మాధవ్‌ను అభినందించారు. ఈ సమావేశంలో పలు సమస్యలు, విధాన సూచనలతో కూడిన సమగ్ర నివేదికను మాధవ్‌కు అందించారు. ఆ నివేదికలో అనకాపల్లి-ఆనందపురం రహదారిని 12 లైన్ల పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేయడం, టూరిజం-హాస్పిటాలిటీ, ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) ప్రధాన రహదారులపై 1 మెగా వాట్ సామర్థ్యంతో చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల పాలక మండలి ఎన్నికలు, చట్ట మార్పులు, సిబ్బంది నియామకాలలో స్వతంత్రత తదితర అంశాలపై పీవీఎన్ మాధవ్‌కు నివేదిక అందించారు.

మెరుగైన వైద్యం అందించండి

- ఏయూ విద్యార్థి అభిషేక్ తల్లిదండ్రుల వేడుకోలు
- వారి అభ్యర్థన మేరకు కేజీహెచ్ నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలింపు!



కారు ముందు బైఠాయించిన అభిషేక్ తల్లి, సోదరి

దాబాగార్డెన్స్: తమ కుమారుడు అభిషేక్‌కు మెరుగైన వైద్యం అందించాలని అతని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ కక్ష సాధింపు చర్యల వల్ల విద్యా సంవత్సరం కోల్పోతున్నాననే మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసిన ఏయూ విద్యార్థి అభిషేక్‌కు కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్న విషయం తెలిసిందే. అభిషేక్‌ను పరామర్శించడానికి గురువారం ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, విభాగాధిపతి వెంకటరావు, ఎంబీఏ ప్రొఫెసర్ జాలాది రవి కేజీహెచ్‌కు వచ్చారు. అభిషే క్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న తర్వాత వారు తిరిగి వెళ్తుండగా.. విద్యార్థి తల్లి, సోదరి వారి కారు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అభిషేక్‌కు ఇక్కడ సరైన చికిత్స అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం, ఏయూ యాజమాన్యం కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణిని కలిసింది. ప్రస్తుత పరిస్థితిలో అభిషేక్‌ను బయటకు తీసుకెళ్లడం సరికాదని డాక్టర్ వాణి వారికి సూచించారు. అయితే కుటుంబ సభ్యుల కోరిక మేరకు అభిషేక్‌ను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. విద్యార్థిని పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుల్లి చంద్రశేఖర్ యాదవ్, పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండారెడ్డి, ఏఐఎస్ఎఫ్ ఏయూ నాయకుడు అభిషేక్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల
కమిటీల నియామకం



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అనుబంధ విభాగాల కమిటీలను నియమించారు. 22 జిల్లా అనుబంధ విభాగాల్లో పలువురికి వివిధ హోదాల్లో స్థానం దక్కింది. ఈ మేరకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

- వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ విభాగం కార్యదర్శులుగా దుడ్డా తాతారావు, నమ్మి శంకర్రావుతో పాటు 9 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- జిల్లా అంగన్‌వాడీ విభాగం ప్రధాన కార్యదర్శిగా సిమ్మా కనక మహాలక్ష్మి, కార్యదర్శిగా మారే ఝాన్సీతో పాటు ముగ్గురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- జిల్లా బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా పల్లా శ్రీనివాసరావు, వడ్డాది గోవిందరాజు, కార్యదర్శులుగా అంబటి అప్పలరాజు, డి.ఎల్ విజయరాజుతో పాటు నలుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- గ్రీవెన్స్ సెల్ ప్రధాన కార్యదర్శులుగా గుడ్ల ఆదినారాయణరెడ్డి, రాయితీ సతీష్, కార్యదర్శులుగా పత్రపల్లె వేలంగిరాజు, అడపాక నానిబాబు, సిరపు దివాకర్‌రెడ్డి, పెద్దిరెడ్డి చంద్రశేఖర్‌తో పాటు ఆరుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- క్రిస్టియన్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా టి.జాన్స్ సుధాకర్, కార్యదర్శిగా చల్లపిల్లి సత్తిబాబుతో పాటు ముగ్గురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శులుగా ఎండీ షరీఫ్, మహమ్మద్ సిరాజుద్దీన్, కార్యదర్శులుగా మహమ్మద్ అనీష్, హన్సారా వలీతో పాటు ఐదుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- సాంస్కృతి విభాగం ప్రధాన కార్యదర్శిగా తమ్మినేని దాలినాయడు, కార్యదర్శులుగా గొర్రిపోటి శివ, బయలపూడి సన్యాసిరావులతో పాటు నలుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శులుగా కోట ఆనంద్ ప్రసాద్, నంబాల కన్నారావుతో పాటు ఒక ఎగ్జిక్యూటివ్ మెంబర్
- జిల్లా డాక్టర్స్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా పత్తి రమణ
- ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా మేడలవలస లోకనాథరావు, రెంగుళ్ల రోజాకుమారి, ప్రధాన కార్యదర్శులుగా నీలాపు గణపతి, సంగంరెడ్డి సుగుణకుమార్, బొట్టా రామిరెడ్డి, కార్యదర్శులుగా కంద్రపు శ్రీరామరెడ్డి, కర్రి రాములు, జి.జగజ్జీవన్‌రావు, టి.ఎస్ మూర్తి పట్నాయక్‌తో ఏడుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- ఇంటెలెక్చువల్ ఫారం వింగ్ ప్రధాన కార్యదర్శులుగా మానేపల్లి సుగుణ, చిర్ల సత్యనారాయణరెడ్డి, కార్యదర్శులుగా దాసరి విజయ భాస్కర్ రెడ్డి, మహమ్మద్ సలీమ్ సాహెబ్, చేపల అప్పరాజు, గిన్ని రాధాకృష్ణ, బోని అప్పారావు,
- ఐటీ వింగ్ ప్రధాన కార్యదర్శులుగా డానియల్ ఫణీ బెందుర్తి, నీలాపు లోకేష్‌కుమార్ రెడ్డితో పాటు ముగ్గురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నీలాపు లక్ష్మి, కార్యదర్శిగా దశమంతల రామలక్ష్మి, గరికి రమా, పాతోజీ అమ్మాజీతో పాటు ముగ్గురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శులుగా గొర్లి మేరీ ప్రసన్న, దలి రామకృష్ణారెడ్డి
- ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శిగా గనగల్ల నరసింహరావు, కార్యదర్శిగా కాండ్రేగుల అప్పలనాయుడుతో పాటు నలుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- ఆర్‌టీఐ వింగ్‌లో కార్యదర్శులుగా అరుగుల రాజ్, బసవ కళ్యాణ్‌రాజుతో పాటు ముగ్గురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- ఎస్సీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శులుగా ఇతలపాక రవిశంకర్, కొరువాడ చిన్నారావు, కార్యదర్శులుగా గార చిన్న తాతబ్బాయి, అడపాక నరసారావుతో పాటు ఏడుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు,
- సోషల్ మీడియా విభాగం ప్రధాన కార్యదర్శిగా సిరిపురం అన్నమణి, కార్యదర్శిగా నొడగల చరణ్ కిశోర్‌తో పాటు నలుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు,
- ఎస్టీ సెల్ విభాగం కార్యదర్శులుగా పెంద్ర విశ్వనాథతో పాటు ముగ్గురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- స్టూడెంట్ వింగ్‌లో ప్రధాన కార్యదర్శిగా పిలకా మోహన్, కార్యదర్శిగా దుక్కా గోవింద్‌తో పాటు ఒక ఎగ్జిక్యూటివ్ మెంబర్
- వాణిజ్య విభాగంలో కార్యదర్శులుగా కొట్యాడ గంగాధర్, శిరాపు శ్రీనివాసరెడ్డితో పాటు ఇద్దరు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శిగా బత్తుల రాము, కార్యదర్శులుగా పొట్నాడ రామారావు, కోరాడ వాసుదేవరావుతో పాటు ముగ్గురుని ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- వలంటీర్ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా డి.అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా అన్నెపు సూర్యనారాయణ, కార్యదర్శులుగా జి.గురుమూర్తిరెడ్డి, డి.స్వరూపరాణి, ఆళ్ల రమణమ్మ, సనపల నారాయణస్వామి, జి.గోవింద్‌రెడ్డితో పాటు 10 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- జిల్లా చేనేత విభాగం ప్రధాన కార్యదర్శిగా కాకి కొండబాబు, కార్యదర్శులుగా ఎం.కనక మహాలక్ష్మి, బతుల మధుబాబుతో పాటు ఒక ఎగ్జిక్యూటివ్ మెంబర్.
- జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శులుగా గుమ్మడి చంద్రమౌళి, పిల్లా అనురాగ్, సెక్రటరీలుగా వాశెట్టి శ్యాంకుమార్, డి.సంతోష్‌కుమార్‌తో పాటు ఆరుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమించారు.

ఏయూకి దివీస్ రూ.3.21 కోట్ల సాయం

- రూ.2.36 కోట్ల వ్యయంతో 72 ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు
- కెమిస్ట్రీ లేబరేటరీ-1,2 ఆధునికీకరణ



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల కల్పనకు దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ రూ.3.21 కోట్ల విలువైన సహాయాన్ని అందించింది. ఇందులో భాగంగా రూ. 49.96 లక్షలతో ఆధునికీకరించిన కెమిస్ట్రీ లేబొరేటరీ-2ని ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య జి.పి.రాజశేఖర్.. దివీస్ ల్యాబ్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎల్.వి.రమణ, జనరల్ మేనేజర్ వై.ఎస్.కోటేశ్వరరావులతో కలిసి ప్రారంభించారు. గతంలో రూ.36 లక్షలతో కెమిస్ట్రీ లేబొరేటరీ-1ని దివీస్ ఆధునికీకరించిన సంగతి తెలిసిందే. అలాగే రూ.2.36 కోట్ల వ్యయంతో ఏయూలోని వివిధ విభాగాలు, హాస్టళ్లు, కార్యాలయాల్లో 72 ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. వీటిని వీసీ ప్రారంభించి, దివీస్ ల్యాబ్స్ యాజమాన్యానికి, చైర్మన్ మురళీ దివీస్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మౌలిక వసతులు విద్యార్థుల ఆరోగ్యానికి, అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఏయూ శతాబ్ది వేడుకల సందర్భంగా పరిశ్రమలు, దాతలు ఇలాంటి విరాళాలు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దివీస్ చైర్మన్ మురళీ దివీస్ సందేశాన్ని సంస్థ ప్రతినిధులు చదివి వినిపించారు. తమ కుటుంబ సభ్యులు, ఉద్యోగుల్లో చాలా మంది ఏయూ పూర్వ విద్యార్థులని, ఉన్నత విద్యను అందిస్తున్న ఏయూకి సీఎస్సార్ నిధుల ద్వారా సహకారం అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ఎస్.కిశోర్‌బాబు రిజిస్ట్రార్ ఆచార్య ఈ.ఎస్.ధనుంజయరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, దివీస్ సీఎస్సార్ మేనేజర్ డి.సురేష్ కుమార్, ఆచార్య కె.బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణకు పౌరులు సిద్ధం కావాలి



సివిల్ డిఫెన్స్ శిక్షణ పొందుతున్న వలంటీర్లతో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

దాబాగార్డెన్స్: విపత్తులను ఎదుర్కొనేందుకు పౌరులు సిద్ధంగా ఉండాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. ద్వారకానగర్‌లో జీవీఎంసీ, విపత్తు నిర్వహణ ఆర్థిక నిధులతో సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహించిన సివిల్ డిఫెన్స్ వలంటీర్స్ బేసిక్ ట్రైనింగ్ కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని, మాట్లాడారు. ఇటీవల తరచూ ఏదో విపత్తులు సంభవిస్తున్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు పౌరులు సిద్ధంగా ఉండేలా ఈ సివిల్ డిఫెన్స్ వలంటీర్స్ బేసిక్ ట్రైనింగ్ శిక్షణలు ఎంతో ఉపయోగపడతున్నాయన్నారు. సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ శిబిరం ద్వారా 70 మంది వలంటీర్లకు 20 రోజుల పాటు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్లు, ప్రథమ చికిత్స, అగ్నిమాపక చర్య, వార్డెన్ సర్వీసెస్, కమ్యూనికేషన్‌పై శిక్షణ ఇచ్చారన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలను రక్షించేందుకు, ప్రభుత్వ అధికారులకు సహకరించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన యువత, నేవీ సిబ్బంది ఈ శిబిరంలో శిక్షణ పొందారని తెలిపారు. సివిల్ డిఫెన్స్ వలంటీర్లు కోవిడ్ 19, ఎల్‌జీ పాలిమర్స్ ఆపరేషన్, సిందూర్ బ్లాక్ అవుట్, విమాన విపత్తులకు సంబంధించి మాక్ డ్రిల్ నిర్వహించారన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ సివిల్ డిఫెన్స్ కంట్రోలర్ మధుసూదనరావు, రిటైర్డ్ డీఎంవోహెచ్ రామారావు, ఏడీఎఫ్ వరప్రసాద్, పోలీస్ శాఖ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా నంబర్-1 డీలర్‌గా పద్మజ సుజుకి



అవార్డు స్వీకరిస్తున్న వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిశోర్

విశాఖ సిటీ: విశాఖలోని పద్మజ సుజుకి ఆల్ ఇండియా నంబర్-1 సుజుకి డీలర్‌గా గుర్తింపు పొందింది. సుజుకి మోటర్ సైకిల్స్ ఇండియా ముంబయిలో నిర్వహించిన వార్షిక డీలర్ల సమావేశం -2025లో ఈ అవార్డును సాధించింది. అలాగే మరో ఐదు అవార్డులను సొంతం చేసుకుని జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిశోర్ మాట్లాడుతూ పద్మజ సుజుకీకి ఆల్ ఇండియా నంబర్-1 డీలర్ అవార్డు దక్కడం తమ టీమ్ కృషికి, కస్టమర్ల విశ్వాసానికి నిదర్శనమన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత ఉత్తమ సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. వరుణ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.వినోద్‌కుమార్, పద్మజ సుజుకి సీఈవో అనూరాధ, జీఎం రఫీ పాల్గొన్నారు.